# Andhra Jyothi

## ‘ఏపీ టెట్’కు రాష్ట్రేతర సెంటర్లు

అమరావతి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఏపీ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(ఏపీ టెట్)కు దరఖాస్తుచేసుకున్న అభ్యర్థులకు పాఠశాల విద్యాశాఖ ముందస్తు పరీక్షే పెడుతోంది. అప్లికేషన్‌లో ఆప్షన్ ఇవ్వకున్నా.. ఆసక్తి లేకున్నా కూడా వేరే రాష్ట్రాల్లో పరీక్ష రాయమంటోంది. కోరుకున్న అభ్యర్థులకు ఇబ్బంది లేకపోయినా.. కోరుకోని వారికి కూడా ఇలా రాష్ట్రేతర కేంద్రాలు కేటాయించడంతో అభ్యర్థులు గంగరగోళానికి గురవుతున్నారు. రాష్ట్రానికి చెందిన అభ్యర్థులకు తమిళనాడు, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో పరీక్షా కేంద్రాలు కేటాయించారు. హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్న అభ్యర్థులు తమకు కేటాయించిన సెంటర్లను చూసి దిగ్భ్రాంతికి గురయ్యారు. ఐటీ విభాగం ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది.

- ఈ నెల 21న జరగనున్న పేపర్-1 పరీక్షకు.. కడప జిల్లాకు చెందిన సిరాజ్(1711414201053)కు బెంగళూరులో సెంటర్ ఇచ్చారు.
- ఇదే జిల్లాకు చెందిన సయ్యద్ రుక్సాన(1710914100017)కు నెల్లూరులో కేటాయించారు.
- హిందూపురం ప్రాంతానికి చెందిన తస్లీమ్ తాజ్(1710714201034)కు గుంటూరులో సెంటర్ కేటాయించారు.
- ఈ నెల 25న జరగనున్న పేపర్-2 పరీక్ష రాసేందుకు.. అనంతపురం జిల్లాకు చెందిన కడ్డిపూడి తస్వీరుల్లా(1721615300057)కు నల్గొండ జిల్లా దేశ్‌ముఖి గ్రామంలో సెంటర్ కేటాయించారు.

అప్లికేషన్‌లో సెంటర్‌కు సంబంధించి 5 ఆప్షన్లు ఇచ్చామని. కానీ కొంతమంది ఆప్షన్ ఇచ్చిన చోట అభ్యర్థుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో వేరే ప్రాంతాల్లో సెంటర్లు ఇచ్చామని పాఠశాల విద్యా కమిషనరేట్‌లోని ఐటీ విభాగం ఇన్‌చార్జి శ్రీనివాస్‌సింగ్ చెప్పారు. ఎవరికైతే ఇబ్బంది ఉందో వారికి మళ్లీ ఆప్షన్ ఇచ్చుకునేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు.